క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పంచాయతీలోని గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్యం పనులు చేశారు. మేర్లపాక ఎస్సీ కాలనీ, మేర్లపాకలోని మురుగునీటి కాలువల్లో మురుగును తొలగించారు. దోమల నివారణకు మురుగు నీటి గుంతల్లో బ్లీచింగ్ చల్లారు. మొలాథిన్ స్ప్రే చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

మాజీ సైనికుడి మృతదేహం అప్పగింత

ఏర్పేడు:పోస్టుమార్టం అనంతరం మాజీ సైనికుడు జిజో థామస్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. బుధవారం మండలంలోని మేర్లపాక పద్మావతి హోటల్ సమీపంలోని ముళ్లపొదల్లో మాజీ సైనికుడి మృతదేహం అనుమానాస్పద స్థితిలో వెలుగులోకి రావడం విదితమే. అదే రోజు మృతదేహాన్ని పోలీసులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం కేరళ రాష్ట్రం పతనంతిట్ట, మల్లాపుజసెర్రీ గ్రామం నుంచి మృతుడి కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని అప్పగించడంతో వారు ప్రైవేట్ వాహనంలో కేరళకు తరలించారు.

ముక్కంటి సేవలో సినీనటుడు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను తెలుగు సినీనటుడు, విలన్ పాత్రధారి అయిన టార్జన్ లక్ష్మీనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనాంతరం గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి,అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

స్కూళ్లు తెరిచేనాటికి జగనన్న విద్యాకానుక



జగనన్న విద్యాకానుకలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు

పిచ్చాటూరు: ప్రభుత్వ స్కూళ్లను తెరిచే రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఇవ్వాలని సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఏఎస్ఓ గోపాలక్రిష్ణ, ఏఎంఓ రాముతో కలిసి స్థానిక జెడ్పీ హైస్కూల్లో జగనన్న విద్యాకానుక కిట్లకు సంబంధించి యూనిఫాం, బెల్ట్‌ల కొలతలను వారు పరిశీలించారు. బ్యాగ్స్, డిక్షనరీ, టెక్స్ట్‌బుక్స్‌లను వేరు వేసి సిద్ధంగా ఉంచాలని సీఆర్‌పీలకు సూచించారు. నిర్దేశించిన తేదీలో స్కూళ్లకు వాటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హేమమాలిని, హెచ్ఎం యుగంధర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు సోలార్ ఉపకరణాలు పంపిణీ



సోలార్ ఉపకరణాలను అందుకుంటున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామపంచాయతీ లోని ఓటువాని గిరిజన కాలనీ, కాంపాళెం గ్రామ పంచాయతీలోని చల్లంవారి గిరిజన కాలనీలలోని 25 కుటుంబాలకు శుక్రవారం స్థానిక నవజీవన్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ సహదేవయ్య ఆధ్వర్యంలో సౌర ఉపకరణాలను సర్పంచ్ చిరంజీవి, ఎంపీటీసీ సభ్యులు రవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సహదేవయ్య మాట్లాడుతూ, మారుమూల గిరిజన కాలనీలలో విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతుండటం తమ సంస్థ గురించి, హ్యాపీటెక్ సంస్థ సౌజన్యంతో రూ. 20 వేల విలువ చేసే సోలార్ బ్యాటరీ, ప్యానెల్, రెండు లైట్లు, ఒక టేబుల్ ఫ్యాన్‌ను గిరిజనులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి శాంతకుమార్, వలంటీర్ శిరీష, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుక్కలగుంటలో 'ఫ్యామిలీ డాక్టర్'



కుక్కలగుంటలో వైద్య సిబ్బందితో డాక్టర్ సాయిహారిణి

ఏర్పేడు: మండలంలోని కుక్కలగుంటలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కుక్కలగుంట, గుడిమల్లం, పాయిల్ సెంటర్ గ్రామాల నుంచి వచ్చిన రోగులకు పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిహారిణి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆ తర్వాత దీర్ఘకాలిక వ్యాధులతో పడుతున్న రోగులకు ఇళ్లకు వెళ్లి పరీక్షించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు
- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



సేవారత్న అవార్డు పొందిన వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నేతలు

కేవీబీపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత పాలనలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మునిలక్ష్మి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఉపాధి, పంచాయతీరాజ్ ,ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. గ్రామాల్లోని సమస్యలను సర్పంచులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వ్యవసాయ సబ్సిడీ పనిముట్లను అధికారులు రైతులకు పరిచయం చేశారు. దిగువపుత్తూరు, పోలినాయుడుకండ్రిగ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కేంద్రాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు.

వలంటీర్లకు సన్మానం

సేవా రత్న అవార్డును అందుకున్న మండలంలోని ఓళ్లూరు, కాట్రపల్లె, పెరిందేశం గ్రామాల సచివాలయ వలంటీర్లు సునీల్, వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్లకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, వైస్ ఎంపీపీలు సరస్వతి, శీనుయాదవ్, ముఖ్య నేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, ఎంపీటీసీలు అయ్యప్ప, సుబ్బన్న, మోహన్‌నాయుడు, ఎంపీడీఓ రామచంద్ర, ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే దేవాంగ కులస్తుల అభివృద్ధి



దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిలక్ బాబును గజ మాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌కు సన్మానం

పిచ్చాటూరు: జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్రంలోని దేవాంగ కార్పొరేషన్ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియామకమైన నియోజకవర్గానికి చెందిన బొప్పన తిలక్ బాబు శుక్రవారం సాయంత్రం పిచ్చాటూరులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కలిశారు. ఆయన్ను ఎమ్మెల్యే శాలువతో సత్కరించి, గజమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలోని అని కులాలతో పాటు దేవాంగ కులస్తుల అభ్యున్నతికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జాతీయ దేవాంగ ఫెడరేషన్ నాయకులు గుత్తి త్యాగరాజు, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి, నాయకులు చలపతిరాజు, వరదయ్యపాళెం మండలం ప్రధాన కార్యదర్శి నాగరాజు, సిఎల్ఎన్ పల్లె సర్పంచ్ దద్దు వేణు, మీర్జాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



పొలాల్లో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న ఎస్పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

ఏర్పేడు: మండలంలో పలు గ్రామాల్లో నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఎస్పీడీసీఎల్ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. మూడు రోజుల క్రితం మండలంలో గాలీవాన ధాటికి ఎండీపుత్తూరు, మడిబాక, రాజులకండ్రిగ తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడం విదితమే. అప్పటి నుంచి అధికారులు, సిబ్బంది రాత్రిళ్లు సైతం వీటి పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. జిల్లా గోదాము నుంచి కావాల్సిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించి మళ్లీ అదే స్థానంలో ఏర్పాటు చేశారు. నాటిన వరి, నారుమడులు, దుక్కులు ఎండిపోకుండా కాపాడారంటూ ఎస్పీడీసీఎల్ అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్ నివారణ చర్యలు చేపట్టండి

తిరుపతి అర్బన్: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా చేపట్టి నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లా క్యాన్సర్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంలు, విలేజ్ హెల్త్ క్లినిక్ అసిస్టెంట్లకు 40 మంది వంతున సోమవారం నుంచి శనివారం వరకు శిక్షణ ఇవ్వాలన్నారు. టాటా క్యాన్సర్, స్విమ్స్ ఆసుపత్రుల సహకారంతో పింక్ బస్‌ల ద్వారా పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు. శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, డీఎంహెచ్‌వో శ్రీహరి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ డాక్టర్లు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



కొత్తవీరాపురంలో..



రేణిగుంట : సీపీఎం కార్యాలయంలో..

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఏర్పేడులో రైతు సంఘం, కొత్తవీరాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. రైతు సంఘం జిల్లా నాయకుడు రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కలపాటి గురవమ్మ, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట: స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే మండలంలోని తారకరామానగర్, మల్లవరంలోనూ పుచ్చలపల్లి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓ.వెంకటరమణ, నరసింహారెడ్డి, శివానందం, సత్యశ్రీ, శ్యామ్, రామిరెడ్డి, పద్మనాభం, కిషోర్, దివ్య, దిలీప్‌బాషా పాల్గొన్నారు.

గిట్టుబాటు కూలి వచ్చేలా పనులు



తొట్టంబేడు : కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్



ఏర్పేడు : పనులు పరిశీలిస్తున్న ఏపీడీ సరిత



రేణిగుంట: ఉపాధి పనులను పరిశీలిస్తున్న అంబుడ్స్‌మన్ రాసారాయరాయుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ఉపాధి హామీ పనులలో గిట్టుబాటు కూలి వచ్చేలా కూలీలు పనిచేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని తొట్టంబేడు పంచాయతీలో చేస్తున్న వరవకాలువ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కింగ్ ఇచ్చి పని చేసేలా చూడాలని అధికారులను అదేశించారు. పనుల్లో కూలీల సంఖ్య పెంచుకోవడానికి, వందరోజుల పనులు కల్పించడంలో విఫలమైన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీడీ ప్రేమకుమార్, స్వామి దాసు, ఏపీఓ సుజాత పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలకు వసతుల కల్పన తప్పనిసరి'

బుచ్చినాయుడుకండ్రిగ: వేసవి కాలం నేపథ్యంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు వడదెబ్బ తగలకుండా నీరు, నీడ, సౌకర్యాలతోపాటు ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూడాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కొత్తపాళెంలో చేస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 కూలి పొందవచ్చని, రోజుకు 5 వేల మంది పనిచేసేలా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటలు పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఏపీఓ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అంజిమేడు పంచాయతీలో..

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో కూలీలు రోజుకు రూ.272 వేతనం పొందేలా చూడాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని అంజిమేడు పంచాయతీలో ఉపాధి హామీ పనులను, కూలీల హాజరు పరిశీలించారు. కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటలు పెంచాలని సూచించారు. ప్రతి రోజూ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల మస్టరు పంపాలన్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయం, సాయంత్రం పనులు చేయాలని సూచించారు.సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో జీవన ప్రమాణాలు మెరుగు

రేణిగుంట: ఉపాధి హామీ పనుల వల్ల జీవన ప్రమాణస్థాయి మెరుగుపడుతుందని అంబుడ్స్‌మన్ రాసారాయరాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని జీపాళెంలో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. రోజువారీ కూలీ సగటున ఎంత గిట్టుబాటు అవుతోందో అడిగి తెలుసుకున్నారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు కల్పించాల్సిన కనీస వసతులు, కూలీల హక్కుల గురించి వారికి వివరించారు. జాబ్ కార్డుదారులందరికీ సురక్ష బీమా కట్టించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పథకంలో చిన్న సన్నకారు రైతులు ఉచితంగా పండ్లు, పూల తోటల పెంచుకోవాలని కోరారు. ఏపీఓ జ్యోతిశ్రీ, ఎఫ్ఏ సుధాకర్ పాల్గొన్నారు.

కందాడు, ముసలిపేడు పంచాయతీల్లో..

ఏర్పేడు: మండలంలోని కందాడు, ముసలిపేడు పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను అంబుడ్స్‌మెన్ రాసరాయరాయుడు పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న,సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకాలపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, క్షేత్ర సహాయకులు మునెయ్య, నాగమణి, కూలీలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సంతకాలు లేకనే పేమెంట్లు ఎలా చేస్తారు?



సామాజిక తనిఖీ సభలో సిబ్బందినిత ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

వరదయ్యపాళెం: మండలంలో జరిగిన పలు ఉపాధి పనులకు ఎంపీడీఓ సంతకాలు లేకనే పేమెంట్లు ఎలా చేశారని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ప్రశ్నించారు. అలాగే బిల్లులు చెల్లింపులకు సంబంధించి పలు రికార్డులు సక్రమంగా లేకపోవడంపై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వరదయ్యపాళెం శ్రీశక్తి భవనం వద్ద సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అధ్యక్షత వహించి పంచాయతీల వారీగా జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ వివరాలను సమీక్షించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి మండలంలో వివిధ శాఖల ద్వారా రూ. 6.37కోట్లతో చేసిన 964 పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. పలుచోట్ల జరిగిన స్వల్ప అవకతవకలపై రూ.21వేలు రికవరీకి ఆదేశించారు. అలాగే 29 పంచాయతీల్లో సైతం పనులు వేగవంతం చేసి కూలీల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ నాగరాజు, డీబీఓ భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం



గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, చైర్మన్, ఈఓ, అధికారులు

- దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశం

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం ఆయన ముక్కంటి దర్శనార్థం వచ్చారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, ఆలయాధికారులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికారు. చైర్మన్ ఆయన్ను శేషవస్త్రంతో సత్కరించి స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

కమిషనర్‌కు వినతులు

ఆలయాభివృద్ధికి మరింత సహకారం ఇవ్వాలని కమిషనర్‌ను అంజూరు కోరారు. ప్రధానంగా ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు భూ సేకరణలో ఒక్క భవనం మాత్రమే మిగిలిపోయిందని, దానిని పూర్తి చేసి మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. అలాగే విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయం వద్ద నాలుగు ఇళ్ల భూసేకరణ చేయాలని, అలాగే గంగమ్మ గుడి ఆధునీకరణకు ఒక ఇల్లు సేకరణ చేసి పనులకు పూనుకోవాల్సి ఉందని వివరించారు. వీటికి పరిహారం త్వరగా మంజూరు చేయాలని కోరారు. అలాగే శ్రీ ప్రసన్న వరదరాజ స్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేసేలా సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆయన ఆలయ ఇంజినీర్లతో చర్చించి అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ సతీష్ మాలిక్, లోకేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్ రెడ్డి, డీఈ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, దేవస్థాన ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, వేద పండితులు అర్ధగిరి, సంగమేశశాస్త్రి శర్మ, రాజేష్ శర్మ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఆదర్శవంతంగా ఉండాలి

- టీడీపీ నేతలకు హితవు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నారాయణవనం: రాజకీయాల్లో ఆదర్శవంతంగా ఉండాలేగానీ ఉద్దేశపూర్వకంగా తమ ప్రభుత్వం, ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదని మండల వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీ నాయకులకు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బైపాస్‌లో వైఎస్సార్ సర్కిల్ వద్ద మీడియాతో మాట్లాడారు. సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత తప్పుడు కుల ధ్రువీకరణ పత్రంతో, అడ్డదారిలో పోటీ చేసి గెలిచారని, బీసీ-సీకి చెందిన ఆమె ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి ఏ ప్రాతిపదికన పోటీ చేస్తారని ప్రశ్నించారు. ఆమె బీసీ-సీ అని తమ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధారాలతో సహా వెల్లడించారని, ప్రజా ప్రతినిధులు ఇలాంటి తప్పు చేయరాదని ఆయన హితవు పలికితే..ఆయనపై హేమలత వ్యక్తిగత దూషణల దిగడం, టీడీపీ నేతలతో ఎదురుదాడి చేయడంలో ఔచిత్యమేమిటని నిలదీశారు. సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జేసీఎస్ చైర్మన్ కోనేటి బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, పార్టీ నాయకులు ఏకాంబరం, సారకాయలు, హేమచంద్రారెడ్డి, ఆరుముగం, తిరువేంగడం, అశోక్, సుబ్రమణ్యం, మోహన్, చీరాలయ్య, సర్పంచ్‌లు సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, నాగూరు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలిస్తే బాబుకు ఆక్రోశమెందుకు?



పిచ్చాటూరు : వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పార్టీ నాయకులు



బీఎన్‌కండ్రిగలో..



సత్యవేడులో ..

పిచ్చాటూరు/బుచ్చినాయుడుకండ్రిగ/ సత్యవేడు: అమరావతిలో పేదలకు తమ ప్రభుత్వం పట్టాలిస్తే ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ఆక్రోశం ఎందుకని వైఎస్సార్ సీపీ నాయకులు సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం పిచ్చాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ, సత్యవేడులో పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సెంటు భూమిలో సమాధులు కట్టుకోవాలంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడం శోచనీయమని మండిపడ్డారు. రాష్ట్రంలో పేదలకు ఇంటి పట్టాలు ఇస్తామన్నప్పుడే టీడీపీ కోర్టుకెళ్లి ఏడాది పాటు అడ్డుపడిందని, అమరావతిలో పట్టాలివ్వడంపై కోర్టుకెళ్లి మూడేళ్ల పాటు ఆపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోటీడీపీకి ప్రజలే గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, ఎంపీటీసీ సభ్యులు రమేష్ బాబు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, నాయకులు కిరణ్‌కుమార్, వెంకటేష్, రామచంద్రారెడ్డి, శేఖర్, అబ్రహాం, గోవిందన్, విశ్వనాథం, గోపి, సురుటుపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ ఇమామ్‌బాషా, బీఎస్ కండ్రిగ వ్యవసాయ మండలి చైర్మన్ తులసీరామ్, సుబ్రమణ్యం, లక్ష్మీపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవదాసురెడ్డి, శంకరయ్య, బాలగున్నయ్య, ధనంజయులు, ధర్మయ్య, యువరాజ్, సత్యవేడు మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, సత్యవేడు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కే. శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ పునీదకుమార్, మార్కెటింగ్ కమిటీ సభ్యుడు ఎంపీ రవి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, పార్టీ నాయకులు ఆరూరు శేఖర్, రాబిన్, చిన్నబ్బ, సెంథిల్, శ్రీధర్ రెడ్డి, దయాళన్, చిన్నబ్బ , ఈశ్వరయ్య, పళణి, సురేస్, టింకాయల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: బాగా చదువుకుంటేనే సమాజంలో ఉన్నత స్థానంతోపాటు పేదరికాన్ని జయించవచ్చని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పది పరీక్షల్లో మొదటి, రెండవ, మూడవ ర్యాంకులను సాధించిన జయకృష్ణ (నెలవాయి), చలపతి (చల్లమాంబపురం), జాహ్నవి (బీఎన్‌కండ్రిగ), ఆకాష్ (బీఎన్ కండ్రిగ)లను శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రజాప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, బహుమతులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది పరీక్షల్లో ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చిందన్నారు. ఫలితంగా కార్పొరేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వ బడులే మిన్నగా ఉంటున్నాయని, విలువలతో కూడిన విద్యాబోధనతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటేలా తీర్చిదిద్దుతోందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, రాజశేఖర్, ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పురుషోత్తం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.